

# ఫూల్సు ప్యారడైజు

" ఇలాగయితే దేశాన్ని బాగుచేయడం నావల్లకాదు" బసవరాజు చెప్పాడు తలపట్టుకుంటూ.

ఎదురుగావున్న చిరుద్యోగి జగన్నాథం కంగారు పడిపోయాడు. బసవరాజు అంటే అతని బాసు ఆకారానికి తగ్గట్టు ఎద్దుమొహం, బానబొజ్జ, చిరాకు కలిగించే చూపులు ఒళ్ళు జలదరింప చేస్తాయి.

" అసలేం జరిగింది సార్ !" వినయంగా అడిగాడు.

" ఏం చెప్పమంటావయ్యా - ఆ జాన్ పెట్టిన టియ్యే బిల్లు చూడు - లాడ్జిబిల్లు తడిసిమోపెడయింది. పారపాట్న టూర్ పంపించానే అనుకో - దేశాన్ని దోచి పారెయ్యడమేనా?" బాధగా ఆశ్చర్యంగా అన్నాడు.

" బిల్లు ఎక్కువ క్లెయిము చేశాడు సార్ ! కట్ చేసెయ్యండి సార్ - తిక్క కుదురుతుంది." సర్దుకుంటూ అన్నాడు సదరు జగన్నాథం.

" అస్సలు ఎక్కువ ఎలా వేస్తారయ్యా ! దానికి చేతులు ఎలా వస్తాయి. పని చేస్తున్నదానికి జీతం తీసుకుంటున్నాంగదా - మళ్ళీ టిఏ, డిఏలు, లాడ్జి బిల్లులు - " చికాగ్గా అన్నాడు బసవరాజు.

" అందరూ మీలాగా ధర్మప్రభువులు ఉండరుగదండి ! కక్కుర్తి వెధవలు దేశం నిండా!" కాకా పట్టడంలో దిట్ట జగన్నాథం.

" అందుకేనయ్యా ఒక్కోసారి అనిపిస్తుంది ఏ అమెరికాకో వెళ్ళి పోదామని-" నిట్టూరుస్తూ అన్నాడు బసవరాజు.

" మీలాంటి మెరికల్లాంటి వాళ్ళంతా అమెరికాకు వెళ్ళిపోతే పూర్ ఇండియాలో యింక ఎవరు మిగులుతారండి ! కుక్కమూతి పిందెలు ! దేశం ఇంకా పాడైపోతుంది" భజన చేశాడు జగన్నాథం.

" కదా ! అందుకేనయ్యా పోవాలంటే మనసు రావడం లేదు. మూడు అప్పాయిమెంట్లు

రెడీగా ఉన్నాయి. ఇప్పుడొచ్చే ముష్టి జీతం కంటే యాభైరెట్లు ఎక్కువ వస్తుంది. "

" అమ్మమ్మ ! జీతం కాదు కదండి తమరిలాంటివారికి ముఖ్యం - ప్రిన్సిపుల్సు అండి - మదర్ ఇండియా వదిలి ఫారిన్‌కు ఎలా వెళతారండి తమరు?"

" అదేగదయ్యా నేను బాధపడేది. ఇంత త్యాగం చేసి దేశాన్ని ఉద్ధరిద్దామని కంకణం కట్టుకుంటే ఒక్కడు ఒక్కడన్నా నావెనకాల నడుస్తున్నాడా? నాలాంటి దేశభక్తుల త్యాగాలు గుర్తింపు లేకుండా మరుగున పడిపోతున్నాయి." మళ్ళీ బుసలు కొట్టాడు బసవరాజు.

సరిగ్గా అప్పుడే సురేష్ ఛాంబర్‌లోకి ఎంటరయిపోయాడు లీవు అప్లికేషనుతో. వినయంగా బాసు ముందర లీవు లెటరు పెట్టాడు.

అది చదివి మండిపడ్డాడు బసవరాజు.

" ఏంటయ్యా ఇది?" హూంకరించాడు.

" లీవు లెటరండి." చేతులు కట్టుకుని చెప్పాడు సురేష్.

" ఆమాత్రం నాకూ తెల్సులేవయ్యా - ఇంకా కళ్ళు కనిపిస్తున్నాయి - బుద్ధి పనిచేస్తున్నది." కోపంగా చెప్పాడు బసవరాజు.

" సారీసార్ - పెళ్ళి కుదిరిందండి - వచ్చే నెల మొదటి తారీఖున పెళ్ళి - అందుకు - ఓ పదిహేను రోజులు సెలవు పెట్టాను." నీళ్ళు నమిలాడు సురేష్ !

" పెళ్ళి అన్నది ముఖ్యమైందే జీవితంలో - దేవుడు కరుణించక పోతే జీవితంలో ఒక్కసారే జరుగుతుంది పెళ్ళి ! అంతమాత్రాన దానికి పదిహేనురోజులు సెలవు కావాలా! ఒక్కరోజు చాలదా?" విసుగ్గా అడిగాడు బాసు బసవరాజు.

సురేష్ నెర్వస్‌గా ఫీలయిపోయాడు. ఆఫీసరు ఛండాలుడని తెల్సు. కాని మరీ యింత ఛండాలుడని అతనికిప్పుడే అనుభవమయింది. "పెళ్ళి ఇక్కడ కాదండి-విజయవాడలో- పోను ఒకరోజు, రాను ఒక రోజు పడుతుంది - అక్కడ రెండు రోజులు-కనీసం నాల్గురోజులు"-

" మరి నాల్గురోజులు సరిపోతే పదిహేనురోజులు ఎందుకడుగుతున్నావు!" ఇంతెత్తున మండి పడ్డాడు బసవరాజు.

" కాని - కాని సార్ - ఆ నాలుగురోజులకు ముందు వెనుక చాలా చాలా పన్లు ఉంటాయి కదుసార్ - " నసిగాడు సురేష్.

" అందుకే మన దేశం యిలా తగలడిపోతున్నది. మూడు ముళ్ళు అని చెప్పి ముప్ఫైరోజులు పని ఎగ్గొడతారు. అదే ఫారిన్‌లో అయితే ఏ సండేనో చేసుకుంటారు - లీవులు వాడుకోరు-" చెప్పాడు బసవరాజు.

" అందుకే విడాకులు ఎక్కువ కదుసార్ ఫారిన్‌లో " జగన్నాథం వంతపాడటం

మర్చిపోయాడు.

" అవును జగన్నాథం - ఇందాకటినుండి నువ్వేం చేస్తున్నావు యిక్కడ? నీపని అయిపోయిందిగా - నీ సీటుకు పోయి పనిచేసుకో ఒక్కనిమిషం కూడా వృథా చేయడం నాకిష్టం వుండదు -" కసురుకుంటున్నాడు బాసు.

" సారీసార్ - వెళతాను - వెళతున్నాను - మీ చేతిలో వున్న ఫైలు నాకిస్తే వెళ్ళిపోతాను" అంటూ ఫైలు గుంజుకుని బయటపడ్డాడు.

జగన్నాథం నిష్క్రమించిన తరువాత సురేష్ మళ్ళీ పాట పాడి వినిపించాడు.

" సార్ కనీసం పదిరోజులు శాంక్షన్ చేయండి సార్" ప్రాధేయపడ్డాడు. "నో ! నో ! నాల్గురోజులు చాలు - లీవులెటరు తిరగరాసివ్వు !"

" చచ్చి మీకడుపున పుడతాను - చేసుకోక చేసుకోక నా జీవితానికి ఒక్క పెళ్ళి జరుగుతున్నది - ఓ పదిరోజులివ్వండి సార్!" సురేష్ కన్నీళ్ళ పర్యంత మయ్యాడు, కాళ్ళ బేరానికి వచ్చాడు.

" సరే - ఆరురోజులు శాంక్షన్ చేస్తున్నా - అంటే సండేటు సండే కలిపి ఎనిమిది రోజులు ఎంజాయ్ చేయవచ్చు - తర్వాత పొడిగించకుండా డ్యూటీలో జాయినైపో !" మరోమాటకు అవకాశం యివ్వకుండా పొమ్మన్నాడు బాసు బసవరాజు.

సురేష్ రానున్న ఏడ్పును ఆపుకుంటూ బయటకొచ్చాడు.

బసవరాజు ఓ అరగంట పర్సనల్ ఫోను మాట్లాడాడో లేదో రోజీ లోపలికి వచ్చి మెడికల్ లీవు అడిగింది - మూడు వారాలు.

" ఇదేంటి రోజీ - మెడికల్ లీవు - బాగున్నావుగా నీకేమైంది?"

" పైకి అలా దిబ్బరొట్టెలా కనిపిస్తానే గాని ఒంట్లో బొత్తిగా బావుండటం లేదుసార్ - రాత్రిళ్ళు నిద్రేరాదు- " వగలుపోయింది.

" ఏం మీ ఆయన ఊళ్ళో లేడా?" ఠక్కున అడిగాడు బాసు.

" ఆయనున్నా ఒకటే, లేకపోయినా ఒకటే-వేస్టుగాడు-" సిగ్గుపడుతూ చెప్పింది రోజీ.

" ఏంటి అలా పూచిక పుల్లను తీసేసినట్లు తీసేస్తున్నావు?" ఆశ్చర్యబోయి అడిగాడు ఆసక్తి చూపిస్తూ.

" ఆయన సంగతి అడక్కండి - భలే పిసినారి. ఏదీ ఖర్చు పెట్టడు - అన్నీ దాచి పెడతాడు-" ముందుకు వంగి చెప్పింది రోజీ. బసవరాజు ఆమె అందానికి ఉక్కిరి బిక్కిరి అయ్యాడు.

" మంచిదేగా - నీకే ఉపయోగపడతాయిగా !"

" అది కాదు సార్ - ఏది ఎక్కడ అరిగిపోతుందోనని అపురూపంగా వాడుకుంటాడు - ముట్టుకుంటే మాసిపోతున్నట్లు చూస్తాడు." సిగ్గుపడుతూ చెప్పింది రోజీ.

" అనవసరంగా నువ్వు తొందరపడి అతడ్ని పెళ్ళి చేసుకున్నావు. నీ అందానికి వాడికంటే ఎంతో మంచివాడు దొరికేవాడు-" చెప్పాడు విచారిస్తూ.

" కనీసం మీలాంటివాడు దొరికినా సర్దుకుపోయేదాన్ని - కాని నాకా అదృష్టం లేదు" నిట్టూర్చింది వేడిగా రోజీ.

" ఇంతకీ యిన్ని రోజులు సెలవెందుకు?" గొంతుకేదో అడ్డం పడింది.

" అలా అలా మా ఆయన్ని తీసుకుని ఊటీకి వెళ్ళి వద్దామని దాంతో నా రోగం, ఆయన రోగం కుదురుతాయని." చెప్పింది రోజీ.

" ఒళ్ళు దాచుకోకుండా పనిచేసే నీలాంటి వాళ్ళు ఆఫీసుకు రాకపోతే మనవాళ్ళకు ఏంతోస్తుంది - మన ఆఫీసు ఏం నడుస్తుంది. ఓ రెండు రోజులు తీసుకోరాదు-" బ్రతిమిలాడాడు బసవరాజు.

" ఏం సార్ ! మా ఆయన కంటే పిసినారిలాగా ఉన్నారు - కావాలంటే మీరు మీ అవిడని తీసుకుని ఊటికి రండి - " చెప్పింది సలహా.

" నాకెలా కుదురుతుంది - రెస్పాన్సిబుల్ ఆఫీసర్ని, అయినా నేనన్ని రోజులు సెలవు పెడితే ఈ దేశం ఏమయిపోతుంది?" బాధగా అన్నాడు బసవరాజు.

" అదీ నిజమే సార్ ! ఈమాత్రం వర్షాలు కురుస్తున్నాయంటే మీలాంటి నీతిపరులుండ బట్టే - బై సార్ - మీ కోసం లీవు పొడిగించనులేండి.... మా హనీమూన్ తొందరగా ముగించుకొస్తాం - " హామీ యిచ్చింది.

" నీకు హనీమూనేమో కాని - ఇక్కడ మా ఆఫీసులో హాట్‌మూన్‌గా ఉంటుంది. నువ్వు లేకపోతే - తొందగగా వచ్చెయ్యి" చెమటలు తుడుచుకుంటూ చెప్పాడు బాసు బసవరాజు.


" సార్ - మీరోసారి మాయింటికి డిన్నర్‌కు రావాలి సార్ !" ఆహ్వానించింది మెలికలు తిరుగుతూ రోజీ.

" అబ్బే ! ఎవరి దగ్గరనుండి ఏమీ ఆశించే అలవాటు లేదు. మీ ఇద్దరూ చిలకా గోరువంకల్లాగుంటే మధ్య నేనెందుకమ్మా ?!" సందేహించాడు.

" మీరొక్కరే కాదు సార్ - మీ అవిడా పిల్లలతో రండి" చెప్పింది.

" దాని సంగతి నీకు తెలీదు- అదొక ఎద్దుమొహం - మా నాన్న తొందరపడి దాన్ని నాకు కట్టబెట్టాడు -" నిట్టూర్చాడు బాసు బసవరాజు.

" ఏంసార్ - పెళ్ళి మీ యిష్టప్రకారం జరగలేదా!?" ఆశ్చర్యపోతూ అడిగింది రోజీ,


రండీ.. రండీ!
వేడీ వేడీ ఉప్మాని తీసుకోండీ!!
ఇలా ఇద్దరం కలిసి తృప్తిగా కాఫీ తాగి ఎన్నాళ్ళయిందో!!
ఏమయింది!?
మధ్యాహ్నం నుంచీ కరెంట్ లేదు! అన్ని సీరియల్సూ మిస్సయ్యా!! రేపు పదింటి కల్లా...! ఇంట్లో జనరేటర్ వుండాలి తెలిసిందా!!

బసవరాజు పర్సనాలిటీని పరీక్షగా చూస్తూ.

" అ ! నా మొహం – మా నాన్నకు డబ్బు పిచ్చి – మా మావ వెధవ డబ్బులెక్కువ యిస్తానన్నాడు – వెంటనే ఈయన మాట యిచ్చేశాడు – మాట యిచ్చింతర్వాత వెనక్కి తీసుకోలేంగా ! పెళ్ళి జరిగిపోయింది" ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్ళిపోయాడు బసవరాజు.

" పోనీ తరువాత కార్యక్రమాలలో జాగ్రత్త పడవలసింది" ముసి ముసి నవ్వులు నవ్వుతూ అడిగింది రోజీ.

" పడదామనే ప్రయత్నించాను వెధవది పెద్దవాళ్ళతొందర – వయసు తొందర కాలుజారేట్లు చేశాయి – ముద్దు ముచ్చట్లు తీరకుండానే పిల్లలు పుట్టుకొచ్చారు" విచారంగా చెప్పాడు బాసు బసవరాజు.

" పాపం మీ తప్పేం లేదు – అంతా మీ ఆవిడ తప్పే" రోజీ చెప్పింది.

రోజీ వెళ్ళిపోయినా బసవరాజుకు ఆరోజంతా అదోలా ఉంది.

బాసు బసవరాజు యిల్లు చేరే సరికి శ్రీమతి దుర్గాంబ చిందులు తొక్కుతున్నది. పిల్లపిశాచాలను ఎడాపెడా వాయించి పారేసింది. వాళ్ళు ఆరునొక్క రాగం ఆలపిస్తున్నారు.

" ఏంటి దుర్గా ! ఏంటిది – ఇల్లును అసెంబ్లీగా మార్చావు?" హాస్యమాడబోయాడు.

దాంతో దుర్గాంబకు తిక్కలేచింది.

" ఇంతటి పనికిమాలిన వాళ్ళు పెళ్ళెందుకు చేసుకున్నారు – పిల్లల్ని ఎందుకు కన్నారు?" ఆవేశంగా అరిచింది దుర్గాంబ.

" అదేంటి పిల్లల్ని నేనెక్కడ కన్నాను – ఆ పుణ్యం చేసుకుంది నువ్వేగదే!" సర్ది చెప్పబోయాడు.

" ఏడిసినట్లుంది మీ తెలివి – ఎప్పుడు ఏం మాట్లాడాలో తెలియదు – తెలుగు నేర్చుకోండి ముందు. ఏం శంకించినా సహిస్తాను గాని నా శీలాన్ని శంకిస్తే సహించను జాగ్రత్త!" వార్నింగు యిచ్చింది.

" అదేంటే ఎద్దుమొహమా – యిప్పుడు నేనేమన్నానే !" విస్తుపోయాడు.

" పిల్లల్ని నేనే కన్నానంటే మీ ఉద్దేశ్యం అందులో మీ ప్రమేయం లేదనేగా – అంటే యింకెవడో దున్నపోతుగాడు ఉన్నట్లేగా !" రుసరుసలాడింది దుర్గాంబ.

" ఓసి నీ దుంపతెగ – నే అన్నదానికి జగన్నాథ పండితరాయలులాగా ఎంత వ్యాఖ్యానించావే ! సారీ ! ఇంతకీ దుర్గా నీ దుఃఖానికి కారణంబేమి?" అనునయించ బోయాడు.

" అస్సలు వీళ్ళు మీకు ఎలా పుట్టారాని నాకూ అనుమానం వస్తూ వుంటుంది. ఇవ్వాళ వాళ్ళ ప్రోగ్రెస్ రిపోర్టులు యిచ్చారు – ఇద్దరికీ యిద్దరే ! లెక్కల్లో గుండుసున్నాలు

వచ్చాయి. " బాధగా అంది.

" ఓస్ ! ఇంతేనా !" తీసిపారేశాడు.

" అంతేనా ! ఏ సబ్జెక్టులో కూడా యాభై దాటలేదు. ఇంగ్లీషులో పాతిక - ఫెయిలు !" దుర్గాంబ లబలబలాడింది.

" ఓస్ ! అంతేనా !" ఇంకా తేలిగ్గా తీసిపారేశాడు.

" ఏంటి - తాగొచ్చారా ! నేను ఇంత సీరియస్‌గా మొత్తుకుంటూ వుంటే మీకు ఎగతాళిగా ఉంది. వీళ్ళు పెరిగి పెద్దయి ఏం ఉద్ధరిస్తారు చదువు సంధ్యలు లేంది." చిటపటలాడింది దుర్గాంబ.

" ఒసే వెర్రిదానా ? ఈ కాలం చదువులెందుకే ! ముందు వెనుకలు లేని వాళ్ళకు లెక్కలు - చదువులు. వాళ్ళకేం ఖర్మ - పది తరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్థి వాళ్ళకుంది. చదువు నాస్థి అయినా జాస్థిగా ధైర్యంతో ఉండు" బాసు బసవరాజు చెప్పాడు, భర్తహోదాలో.

" అదే నాబాధ ! ఏ ఆస్తులు పాస్తులు లేకపోయినా పస్తు పడుకునో అడుక్కు తింటూనో బ్రతుకుతారు. ఇంత సిరి సంపదలుంటే వాటిని దోచుకోవడానికి వీళ్ళని ఏమన్నా చేస్తారు చదువులేక పోతే !"

" దుర్గాంబా ! వీళ్ళ వయసెంత - పెద్దోడికి పన్నెండు - చిన్నోడికి పది - అంతేగా - వయసు వస్తే మెదడు వికసిస్తుంది. అయినా డబ్బులు దండుగని యిన్నాళ్ళు వీళ్ళకి ట్యూషన్లు చెప్పించలేదు. ఇంక వీళ్ళకి ప్రైవేట్లు చెప్పిస్తాను." వాగ్దానం చేసాడు బసవరాజు.

" అమ్మో ! వీళ్ళ కోసం అంత డబ్బులు తగలేస్తారా?" విస్తుపోయింది.

" మనకేం ఖర్మే తగలెయ్యడానికి - మా ఆఫీసు పీనుగ జగన్నాథం గాడు ఉన్నాడుగా - వాడు లెక్కల్లో బ్రిలియంటుట - వాడ్ని చెప్పమంటాను ఉద్ధరగా. వాడు ఒంటిలింగం శొంఠి కొమ్ముగాడు - వాడికి టైం పాసవుతుంది - మనకీ పనవుతుంది." చెప్పాడు బసవరాజు.

" అయినా మిమ్మల్ని అనాలి-దేశం దేశం అంటూ అచ్చోసిన ఆంబోతులాగా 'ఆఫీసు - దేశం' అంటూ ఇల్లు - ఇల్లాలును పట్టించుకోకుండా తిరుగుతారు. దాంతో పండితపుత్రః శుంఠః లాగా తయారయ్యారు. నేను ముందే చెప్పానుగా - దేశాన్ని ఉద్ధరించాలంటే ముందు మనల్ని మనం ఉద్ధరించుకోవాలి - ఆ తరువాత సంఘసేవ !" దొరికింది కదాని క్లాసు పీకింది దుర్గాంబ.

" ఒసే పిచ్చిదానా అందుకే గదే - వీలైనంత కాడికి దోచి పెడుతున్నాను - భవిష్యత్తులో మనభవిష్యత్తు తల్లకిందులయినా దోచుకుని దాచుకున్న డబ్బు అన్నా ఆదుకుంటుందని

గదా నా ముందుచూపు. ఈ పిల్ల సన్నాసులకు చదువు వచ్చిందా సరే - లేకపోతే నువ్వేం దిగులు పడనక్కరలేదు - " అభయమిచ్చాడు బసవరాజు.

" దిగులు పడక ఏ నుయ్యోగుయ్యో చూసుకోమంటారా?"

" నుయ్యో గొయ్యో నీకెందుకే అయోమయమా ! అంతగా చావాలంటే అంత పాతపద్ధతులెందుకే - నువ్వెవరివి - ఈ బాసు బసవరాజు పెళ్ళాం పిశాచానివి. ఘనంగా చావాలి! ఏ గ్యాసు సిలిండరు పేలో - ఏకారు యాక్సిడెంటులోనో - ఏ తీవ్రవాదుల చేతిలోనో చావాలి !" చెప్పాడు తాపీగా బసవరాజు.

" అవ్వ చావుకు ఇన్ని దిక్కుమాలిన మార్గాలున్నాయా బసవయ్యా ! నా చావు సంగతి తరువాత ముందు మీ తిండి తిప్పల సంగతి చూడండి - వీళ్ళ మార్కులతో నా మూడు మూర్ఛాపురం పోయి వంట చేయ్యలేదు".

" దాందేముంది మా రోజీకి ఫోన్ చేసి చెబుతాను - క్షణాల్లో వంట రెడీ చేస్తుంది - పోయి మెక్కుదాం !" అంటూ ఫోను దగ్గరికి పరుగెత్తాడు.

సీను కట్ చేస్తే -

బాసు బసవరాజు కారులో రోజీ యింటి ముందు వాలాడు పిల్లాపాపలతో. కాని రోజీ ఎగురుకుంటూ ఎదురురాలేదు - కాలింగు బెల్లు కొట్టి కొట్టి అల్సిపోయింతర్వాత కుంటు కుంటూ వచ్చి తలుపుతీసింది తడిసిన జుత్తుతో - తడిసిన నైట్ గౌనులో చాలా అందంగా పాలరాతి బొమ్మలా మెరిసి పోతున్నది.

దుర్గాంబకు రోజీ అవతారం చూడగానే అరికాలిమంట నెత్తికెక్కింది.

బాసు బసవరాజుకు గొంతుకలో ఏదో అడ్డుపడిపోయింది.

" ఏమ్మా ! మా ఆయన నీగురించి చాలా గొప్పగా చెబితే ఏదో అనుకున్నాను - కాలింగ్ బెల్ కొట్టిన అయిదు నిమిషాలకు తలుపుతీసావంటే నీకు బాసుపైన ఎంత భక్తి ఉందో తెల్సిపోతున్నది" చిటపటలాడింది దుర్గాంబ.


" అయ్యో ! రండి బసవమ్మగారూ - " తడబడింది రోజీ ఆకోపానికి

" నా పేరు దుర్గాంబ - దుర్గ్ అంబ అర్థమయిందా?" కసిరింది.

" సారీ రోజీ - మా ఆవిడ ఏదీ మనసులో దాచుకోలేదు - " నసిగాడు బసవరాజు.

" దాచుకోలేంది ఆమెనా - నేనా !" దుర్గాంబ ఆమె నైట్ గౌనును - అందులోంచి మసగ్గా కనిపిస్తున్న ఎత్తైన వక్షోజాలను చూస్తూ అంది.

" అస్సలు యింకోళ్ళయితే నేను తలుపు తీసే దాన్ని కాదు బసవరాజు గారు ! వచ్చింది సాక్షాత్తు ఇంద్రుడిలాంటి మీరు కాబట్టి లేని ఓపిక తెచ్చుకుని కష్టంమీద తీశాను" రోజీ బాధగా బరువుగా చెప్పింది.


అమ్మో! ఇక్కడ వద్దండి రేట్లు ఎక్కువ!
హైటెక్ శారీ షో రూమ్ A/C
నీ మొహం వెరైటీ ఎక్కువగా వుంటాయి
పెళ్ళిలోపు చీరలు చూపండి
ఏంటా కక్కుర్తి రెండు, మూడు వేలల్లో చూపండి!..
ఇది బావుంది రేటు ఎక్కువగా వున్నది!
ఏడిశావ్! ఇదిచూడు ఆరు వేలు! ఇదేసం సూపర్‌గా వున్నది ఇదే తీసుకో!!
సో..అలా మ్యాజిక్ చేసి కొన్నా! ఎలావుంది!!
AVM

" ఏం అంత ఇష్టంలేదా ?" కరుగ్గా అంది దుర్గాంబ.

" అయ్యో అది కాదండి - నా పరిస్థితి ఏమిటి అని ఆలోచించండి - రాక రాక మీ అంతటి వారు మా యింటిలోకి అడుగు పెట్టడం నాకెంతో ఆనందంగా వుందో చెప్పలేను మాటల్లో - " రోజీ చెప్పబోయింది.

" అందుకేనా ఈ అవతారంలో ' సిరికించెప్పడు ' - లా వచ్చేశావు?" మాట అంటించింది దుర్గాంబ.

" ష్ ! ఏమిటే ఆ విసుర్లు - అసలే చిన్న పిల్ల - కొత్తగా పెళ్ళయింది - మనలాంటి పెద్దలు వస్తే కాస్త కంగారు పడటం సహజమే గదా! " సర్ది చెప్పాడు.

" చిన్నపిల్లా ! అబ్బొ అంత ముద్దొస్తున్నదా - చంక నెత్తుకుని తిరగండి !" మెలికలు విరిచింది దుర్గాంబ.

" అసలేం జరిగిందంటే బాసుగారి భార్యగారూ ముందు మీరు సోఫాలో ఆసీనులు కండి - చెబుతాను - అసలేం జరిగిందంటే - "

" మీ ఆయన లేడా ఇంట్లో ? అసలున్నాడా - " దుర్గాంబ కుతూహలంగా అడిగింది.

" ఏంటే నీ ఉద్దేశ్యం ?" కంగారు పడ్డాడు బసవరాజు.

" అదే ఊళ్ళో ఉన్నాడా లేడా అని - " చెప్పింది దుర్గాంబ.

" వస్తారు-వస్తారు ఆయనెక్కడికి పోతే అక్కడే-పెద్ద వేస్టు కాండేట్టు" - రోజీ చెప్పింది.

" అసలేం జరిగింది రోజీ - ఇందాకేదో చెప్పబోతున్నావు ?" ఆమెను ఆబగా చూస్తూ అడిగాడు బసవరాజు.

" అస్సలేం జరిగిందంటే - అడక్కుండానే మీరు వరాలిచ్చే దేముడిలా మీరు ఫోన్ చేసి మాయింటికి డిన్నర్‌కు వస్తానన్నారుగదా ! ఆ ఆనందంలో స్నానానికి పోయి బకెట్ తన్నేశాను " రోజీ ఆగింది.

" నాన్నా ! బకెట్ తన్నేస్తే బ్రతికే వుంది గదా !" పుత్ర రత్నం సందేహం - "కిక్కుడిది బకెట్ అంటే చచ్చిపోయారని అర్థం చెప్పింది మా టీచరు-"

" చూశారా మనవాడి తెలివి !" దుర్గాంబ ముచ్చటపడి పోయింది.

" అవును రోజీ - బకెట్ తన్నేస్తే - నీళ్ళు ఒలికి పోయాయా - బక్కెట్టే పగిలి పోయిందా -" బసవరాజు అనుమానించాడు ఎగాదిగా చూస్తూ.

" లేదు సార్-నా నడుం పట్టుకుంది-కాలు మెలికపడింది. కిందపడి లేవలేక పోయాను - అందుకే మీరు కాలింగ్‌బెల్ కొడుతున్నా తేరుకుని పైకి లేవడానికి అంత సమయం పట్టింది. ఈబాధ క్షణ క్షణానికి పెరిగిపోతున్నది". తనుకూడా ఓ కుర్చీలో కూర్చుంటూ చెప్పింది.

" ఇంట్లో జండూబామ్ గాని - అమృతాంజనంగాని ఉందా ?" అడిగాడు బాసు

తల అడ్డంగా ఊపి అంది రోజీ.

" అది కాదు సార్ ఎలాగూ మీకు వంట చెయ్యాలి గదాని - ఎప్పట్నించో అడుగుతున్నారు మన ఆఫీసులో మొగ పక్షులు - వాళ్ళని కూడా రమ్మని ఫోన్ చేసి పిలిచాను - ఇప్పుడెలా ?" వగలు పోయింది - రాని కన్నీళ్ళను తుడుచుచుంది రోజీ.

" ఇంకెవరిని పిలిచావు !" ఆశ్చర్యంగా అడిగాడు బసవరాజు.

" ఆ జగన్నాథాన్ని - సురేష్‌ని పిల్చాను - జానీ గాడు దొరకలేదు". చెప్పింది నైటుగౌనును కాలికిందికి లాక్కుంటూ - దాంతో మెడ దగ్గర గౌను జారింది. బసవరాజు దృష్టి అటుపడటంతో మళ్ళీ పైకి లాక్కుంది - పాదాలు కాళ్ళు తెల్లగా మెరిసి పోతున్నాయి. బసవరాజు అటు చూడ్డం దుర్గాంబ చూడనే చూసింది. ఆమె చూపు కొరకొర లాడింది.

- ఆవేడి రోజీపైన ప్రసరింప చేసింది.

" చూడు రోజీ, నువ్వు మమ్మల్ని విందుకు పిల్చావు - కాని ఈ మొగాళ్ళకు కనువిందు కలగచేస్తున్నావు - కాస్త డ్రస్సు మార్చుకు రాకూడదు -" దుర్గాంబ ఆదేశం. " అయ్యో ! అక్కయ్యగారు - అంత ఓపిక ఉంటే ఆపని ఎప్పుడో చేసేదాన్ని - నేనేమన్నా సినిమా హీరోయిన్నా ఒళ్ళు దాచుకోకుండా ఉండటానికి - నానదుం - నా కాళ్ళు నా స్వాధీనంలో లేవు -

అది అలా ఉంచి యిప్పుడు యింటికి పిల్చి మీ అందర్ని పస్తులుంచడం ఎంత అవమానమని సిగ్గుతో చచ్చి పోతున్నాను -" రోజీ సిగ్గు పడుతూ చెప్పింది. ముందుకు వంగి మొహాన్ని రెండు చేతులతో కప్పుకుంది.

" వరుసలు కలపకు అమ్మడు - నువ్వు నాకు చెల్లాయివైనా ఫర్వాలేదు గాని మా ఆయన మటుకు నీకు బాసే - బావగాదు." జాగ్రత్త పడింది దుర్గాంబ.

" దాందేముందీ - అందరం హోటల్‌కు పోయి భోంచేద్దాం -" బసవరాజు సలహా.

" ఎంత ఖర్చవుతుందో ఆలోచించారా ? మీ రోజీ దగ్గర అంత ఖర్చు పెట్టిస్తారా? ఉండద్దూ దుడ్డులు !" దుర్గాంబ అంది అతని కాలుతొక్కుతూ కసిగా.

" అది కాదు అక్కయ్యగారు - డబ్బుల దేముంది, మళ్ళీ సంపాదించు కోవచ్చు - కాని కుంటి కులాసం లాగా నేను మీ భుజాలపైన వాలిపోయి హోటలుకు వస్తే నలుగురు నవ్వరూ !" రోజీ వాపోయింది.

" రోజీ ! నేను పోయి భోజనాలు పార్సిలు చేయించుకొస్తాను - అందరం కలసి మీయింట్లో తిందాం !" చెప్పాడు బసవరాజు.

" అయ్యో ! మీరు నా బాసు - మిమ్మల్ని పార్సిలు కట్టించుకు రమ్మని ఎలా చెబుతాను

– మా ఆయన వెధవ ఎక్కడ ఏడ్చాడో యిలాంటి అడ్డమైన పన్లు చెయ్యడానికి. సమయానికి మా వాళ్ళెవరైనా ఉంటే వంట చేసేవాళ్ళు – నానడుంకు జండూ బామ్ పట్టించేవాళ్ళు – ఈ ఊళ్ళో మొగుడున్నా ఒంటరిదాన్నైపోయాను –" బుడిబుడిరాగాలు తీసింది.

" రోజీ ! దీనికోసం నువ్వింతగా చింతించాల్సిన అవసరం లేదు – సంఘ సేవకురాలిని నేనున్నాను – వంటకూడా – నువ్వేం వర్రీగామాకు – గంటలో చేసి అవతల పారేస్తాను – ముందు నువ్వు బెడ్డురూములో రెస్టుతీసుకో – ఈమొగాళ్ళ మధ్య ఇలా ఉండటం వంటికి మంచిది కాదు – " అంటూ బలవంతాన ఆమెను మోసుకుపోయి బెడ్‌రూములో పడుకోబెట్టి జెండూబామ్‌తో ఉపచర్యలు చేసింది.

" థ్యాంక్సు అక్కయ్యగారు–వచ్చేజన్మలో మీచెల్లెలుగా పుడతాను– " చెప్పింది.

ఆపైన దుర్గాంబ ఛెంగున వంటింట్లోకి దూకింది.

ఈలోగా జగన్నాథం – సురేష్‌లు దిగబడ్డారు. చేతుల్లో స్వీటు బాక్సులతో "హ్యాపీ బర్త్‌డే టూయూ సార్ !" జగన్నాథం పాడాడు.

" ఈ శుభదినం మళ్ళీ మళ్ళీ రావాలి సార్ !" సురేష్ చెప్పాడు స్వీట్లు అందిస్తూ.

బసవరాజు బిత్తరపోయాడు ఊహించని సంఘటనకు

" మీకేమన్నా తలతిరిగిందా – నాకేం దినం ? ఎందుకు స్వీట్లు – " అడిగాడు.

" తమరి పుట్టిన రోజని తెల్సింది – అందుకే ఇవ్వాళ వాతావరణం యింత ఆహ్లాదకరంగా ఉంది." జగన్నాథ పండితరాయలి వ్యాఖ్య !

" అయినా మీదెంత విశాల హృదయం సార్ – మీ పుట్టిన రోజు మీ యింట్లో చేసుకోకుండా మీ సబార్డినేట్ల యిళ్ళలో చేసుకుంటున్నారు." సురేష్ రెచ్చి పోయి పొగిడాడు.

" ఏం నాన్న, మాకు చెప్పలేదేం నీ పుట్టినరోజని ?" పెద్దోడు అడిగాడు.


" అయితే నాకు కేక్ ఎందుకు తెచ్చివ్వలేదు? " చిన్నోడు రాగం అందుకున్నాడు.

" ఆగండిరా వెధవల్లారా – నా పుట్టినరోజు నాకు తెలీకుండా ఎలా వచ్చిందిరా! ఎక్కడో కన్‌ఫ్యూజన్ ఉంది." తలబాదుకున్నాడు బసవరాజు.

" పెద్దోళ్ళకు జయంతి – వర్ధంతి అని రెండు దినాలు చేస్తారు – మీరు కూడా ఆ కోవలోకి చేరిపోయారా ఏంటి?" దుర్గాంబ ప్రగాఢ ఆశ్చర్యాన్ని ప్రకటించింది. అట్లకాడతో కూరమాడుతుంటే పరుగెత్తింది లోపలికి.

ఇంతలో దేక్కుంటూ పాక్కుంటూ రోజీ వచ్చింది – కలుగజేసుకుంది."సారీ సార్ – మీ అనుమతి లేకుండా నేనే మీ పుట్టినరోజు సెలబ్రేట్ చేస్తున్నాను".

" నా అనుమతి అటుంచు – నీ మతి ఏమయింది – వచ్చేనెల కదా నా బర్త్‌డే !" ఆశ్చర్యంగా అడిగాడు.


చీర్స్...
సారీ...

" నిజమే సార్-కాని తెలుగు తిథి-నక్షత్రాల ప్రకారం-ఇవ్వాళే మీ పుట్టిన రోజు-తెలుగు భాషకు-తెలుగు దనానికి ప్రాముఖ్యత పెరిగిపోయిందని మీరు తెలుగుజాతి రత్నాలని ఈరోజు మీ జన్మదినం జరుపుకోవడం అత్యంత ముదావహంగా ఉంటుంది" జగన్నాథం ఉవాచ.

" అవును జగన్నాథం మీ అందరికీ నాజాతకం ఎలా తెల్సింది !"

" అదేంటి సార్ సోనియాగాంధీ జాతకం - రాజశేఖరరెడ్డి జాతకం ఒకళ్ళు చెప్పాలా సార్ - అందరికీ నోటెడ్ కదుసార్ !" జగన్నాథం దరువులేశాడు.

" వెదవది - మాకింకేం పని సార్ - మీ యొక్క యోగ క్షేమాలు - సమాచారాలు తెల్సుకోవడమే గదా !" సురేష్ వంత పాడాడు.

బసవరాజు ఉబ్బితబ్బిబ్బయి పోయాడు.

" మీరు కూర్చోండి సార్ " అంటూ నిలబడున్న బసవరాజును ఒక్క తోపుతోసింది. రోజీ. అజాగ్రత్తగా వున్న బసవరాజు ఢాం అని సోఫాలో పడిపోయాడు. బసవరాజుకు కోపం వచ్చింది కాని తోసింది సుకుమారిగాబట్టి నవ్వేశాడు.

"ఎన్నో జన్మల పూర్వపుణ్యం వలన మాకు మీలాంటి బాసు దొరికాడు సార్ నిజంగా ఇది మా అందరి అదృష్టం !" భజన మొదలెట్టాడు జగన్నాథం.

"ఏంటి బాసును కాకాపట్టి వెర్రి వెధవని చేస్తున్నట్లున్నారు ?" దుర్గాంబ అట్లకాడతో విసురుగా వచ్చేసింది.

"అబ్బా ! పార్వతీ పరమేశ్వరుల్లా ఇద్దరూ అలా కూర్చోండి - సారుతో కేక్ కట్ చేయిస్తాము" జగన్నాథం చెప్పాడు.

" అక్కయ్యగారు మీరలా కూర్చోండి - సమయం మించి పోతున్నది" అంటూ రోజీ స్టూలు ముందుకు లాగింది - సురేష్ కేక్ బాక్స్ అతని ముందుంచాడు.

జగన్నాథం హడావిడిగా క్యాండిల్సు తీసి - గుచ్చి - వెలిగించాడు.

"సార్ ఈ దీపాలని ఆర్పి ఈ చాకుతో కేక్ కట్ చెయ్యండి సార్!" రోజీ సూచనలిచ్చింది. దుర్గాంబ జరుగుతున్న వ్యవహారాన్ని ఆశ్చర్యంగా చూస్తున్నది.

" ఏంటో బాగా మొహమాట పెట్టేస్తున్నారు - తెలుగు వాళ్ళమయివుండి యింట్లో దీపాలు ఆర్పడమేమిటి ! ఒకళ్ళింట్లో దీపాలు వెలిగించడమే మన సాంప్రదాయం - విదేశీయుల్లాగా ఇంకోళ్ళ యింట్లో దీపాలు ఆర్పడం మన ప్రవృత్తి కాదు" అంటూనే దీపాలు ఆర్పి కేక్ కట్ చేశాడు బాసు బసవరాజు.

చప్పట్లు మారుమ్రోగాయి - టేప్‌రికార్డర్ లోంచి ' హ్యాపీ బర్త్‌డే ' అన్న పాట వినిపిస్తూ ఉంటే అందరూ కోరస్ పాడారు.

రోజీ కేక్ ముక్కను బసవరాజు నోటిలో పెట్టింది కావాలని ఆమె వేలుకూడా కొరికాడు ఎవరూ చూడకుండా బసవరాజు. చిరుకోపం ప్రదర్శించింది రోజీ. కేక్ ఒక ముక్కను తీసి దుర్గాంబ నోటికందించాడు – ఆమె అతని వేలు గట్టిగా కొరికింది ‘ అబ్బా !’ అని అరిచాడు.

అందరూ నవ్వారు.

సురేష్ ఒక బంగారపుటుంగరాన్ని బాసు చేతి వేలికి తొడిగాడు.

జగన్నాథం ఒక శాలువా కప్పాడు.

రోజీ ఒక వాచీ ప్రజెంట్ చేసింది.

బసవరాజు కదిలిపోయాడు. అతని కళ్ళంబెడ కన్నీరు దొర్లింది. పిల్లలు ఆబగా కేకు పీసులు తింటున్నారు. దుర్గాంబ వంటింట్లోకి వెళ్ళింది.

అందరూ ఆఫీసు ప్రగతి గురించి – బసవరాజు నాయకత్వం గురించి పొగిడారు.

“ భోజనాలు రెడీ ” అంది దుర్గాంబ కాసేపటికి వచ్చి వాళ్ళ సంభాషణను అడ్డుకుంటూ.

“ రోజీ ! మీ ఆయన ఏడి? ఫోన్ చేసి చెప్పు రమ్మని” – బసవరాజు చెప్పాడు.

“ యూజ్‌లెస్‌ఫెలో–ఎక్కడో తాగిపడిపోయి ఉంటాడు–ముందు మీరు కానిచ్చెయ్యండి–” రోజీ చెప్పింది – జారిన చున్నీను సరిచేసుకుంటూ.

సురేష్ – జగన్నాథం టేబుల్సు – ప్లేట్లు అరేంజి చేశారు.

దుర్గాంబ పాత్రలన్నీ తెచ్చి వడ్డించసాగింది. అందరూ ప్లేట్ల ముందు కూర్చున్నారు.

“ నేను ఎల్లుండి నుండి ట్రైనింగ్‌కు హెడ్డాఫీసుకు వెళ్ళాలి– పదిరోజులు – రేపే బయలుదేరుతున్నాను – ఆఫీసును జాగ్రత్తగా చూసుకోండి – దేశరక్షణ మీ భుజస్కంధాలపైన ఉంది. అసలే టెర్రరిజం పెరిగిపోతున్నది – మన ఆఫీసును వెయ్యి కళ్ళతో కాపాడుతూ ఉండండి.” భోంచేస్తూ సూచనలు యిస్తున్నాడు.

“ అబ్బ ! నలభీమ పాకం లాగుంది అక్కయ్యగారు మీవంట ! ” జగన్నాథం దుర్గాంబను ఆకాశానికి ఎత్తేశాడు కాసేపు.

“ ఇలాంటి వంట తిని పది సంవత్సరాలైంది – ” సురేష్ ఏడుస్తూ అన్నాడు. “ అదేం బాబూ – రోజూ అన్నం తినవా ?” దుర్గాంబ అడిగింది.

“ లేదక్కయ్యగారు – పదేళ్ళ క్రిందటి దాకా మా అమ్మ మీలా ఇలా అద్భుతంగా వంట చేసేది – ” చెప్పాడు సురేష్ “ కడుపునిండా తినేవాళ్ళం”.

“ ఏం ఇప్పుడు వంట చేయడం లేదా ?” దుర్గాంబ అడిగింది.

“ లేదు–చెయ్యడానికి ఆమె లేదు–పోయి పదేళ్ళయింది” సురేష్ ఏడుస్తూ చెప్పాడు.

దుర్గాంబ లేచివచ్చి అతన్ని కౌగిలించుకుని ఓదార్చింది. బాసు ఇబ్బంది పడ్డాడు.

" సురేష్ ప్రొద్దున ఎన్ని రోజులు లీవు కావాలంది 15 రోజులా-పాపం-పెళ్ళి అన్నావు కదా ! ఇరవై ఒక్క రోజులు తీసుకో - జాలీగా ఎంజాయ్ చెయ్యి" బసవరాజు వరం యిచ్చేశాడు.

" ఆ ! మా తమ్ముడి పెళ్ళా - ఆఫీసుదేముంది ఎప్పుడు ఉండేదే - ఆపైన ఇంకో వారం ఫ్రెంచి లీవు తీసుకో - " దుర్గాంబ సెలవిచ్చింది.

బసవరాజు తలకాయ కొట్టుకున్నాడు.

" సార్ ! మీ పుట్టిన రోజు శుభసందర్భంలో రోజీ గార్కి కూడా మూడు నెల రోజులు సెలవు యిప్పించండి - ఆమె ఏదో ట్రీట్‌మెంటు తీసుకోవాలిట - చిన్న ఆపరేషన్ కూడా చేయించుకోవాలిట " జగన్నాథం సందు చూసి చెప్పాడు.

" ఐసీ - కానీ రోజీ లేకపోతే మన ఆఫీసుకు పొద్దుపోదయ్యా - సరే అంత అవసరమయితే తీసుకోమను - కాని రోజుకు రోజీ ఒక్క గంటన్నా వచ్చి పోతూ ఉండాలి మన ఆఫీసుకు " రోజీతో రాజీ పడిపోతూ చెప్పాడు బాసు బసవరాజు.

" సార్ ! థ్యాంక్యూ సార్ - నిజంగా మీది విశాల హృదయం సార్ - మా అక్కయ్య చాలా అదృష్టవంతురాలు - మరి మన జగన్నాథం ఎంతో సిన్సియర్ వర్కర్ కదు సార్ -

అందుకని అతనికి ఈ ఏడన్నా ప్రమోషన్ యిప్పించండి సార్ - చచ్చి మీ ఆవిడ కడుపున పుడతాడు - " రోజీ రికమెండేషన్ చేసింది.

" అంత పని చెయ్యొద్దు తల్లీ - నేను ఆపరేషన్ కూడా చేయించుకున్నాను" కంగారు పడ్డాడు. " నేనూ ఈ సంవత్సరం అతన్ని వన్ అండ్ ఓన్లీ వన్ కాండిడేట్‌గా రికమెండ్ చేసి ప్రమోషన్ తెప్పిస్తాను." హామీ యిచ్చేశాడు బాసు బసవరాజు.

కబుర్లతో కాలం దొర్లిపోయింతర్వాత - బసవరాజు లేచాడు.

" ఫ్రండ్స్ - ఇప్పటికే చాలా ఆలశ్యమయింది - మేము వెళ్ళాలి - పిల్లలు నిద్రబోతున్నారు - రేపందరూ టైము కొచ్చి మీ పన్లు మీరు చేసుకోండి - " చెప్పాడు బయటికొస్తూ.

" అప్పుడప్పుడు మా యిల్లు పావనం చేస్తూ ఉండండి అక్కయ్యగారు !" బొట్టు పెట్టి చీర యిస్తూ చెప్పింది రోజీ. దుర్గాంబ అయిసయిపోయింది.

కాంపౌండు వాల్ గేటు దాకా వచ్చి సెండాఫ్ యిచ్చారు మిత్రులు వారికి. వాళ్ళు కనుమరువ్వంగానే రోజీ ఎగిరి గంతేసి డాన్సు చేసింది.

" పిచ్చి వెధలు - నా నడుం నెప్పి - కాలు బెణికిందంటే నమ్మారు - ఏదీనా పందెం డబ్బులు నాకివ్వండి - " రోజీ జగన్నాథంను, సురేష్‌ను అడిగింది.

" ఇది నేనొప్పుకోను - " జగన్నాథం అన్నాడు.

" నిజంగా నువ్వు పందెంలో గెలిచావా రోజీ !" సురేష్ అడిగాడు.

" ఆ ! ఎందుకు గెలవలేదు - మన బాసును పిల్లిని చేసి ముక్కు పిండి ఒక ఆట ఆడిస్తానన్నాను - అలాగే ఆడించా - మనం ఏం చెబితే అది చేశాడుగా - నీకు లీవిచ్చాడు - జగన్నాథంకు ప్రమోషన్ గ్యారంటీ యిచ్చాడు - ఇంకేం కావాలి మీరు పందెం కట్టిన వెయ్యిరూపాయలు, వెయ్యిరూపాయలు కక్కండి !" డిమాండు చేసింది.

" కాని నీకు నడుంనొప్పని నాటకం ఆడావు - అబద్ధాలు చెప్పావు - " జగన్నాథం.

" ఎవ్విరిథింగ్ ఈజ్ ఫెయిర్ యిన్ లవ్ అండ్ వార్ ! వాడ్ని వాజమ్మను చేయడానికి నా జిత్తులు నావి !" రోజీ సమర్థించుకుంది.

చేసేది లేక మొహం వ్రేలాడేస్తూ చెరో వెయ్యి ఆమెకిచ్చి దండం పెట్టి బయటపడ్డారు అఫూల్సు ప్యారడైజునుండి.

" మీ జాతకం వాళ్ళకెలా తెల్సింది ?" దార్లో అడిగింది దుర్గాంబ.

" తిక్కోళ్ళు-పెళ్ళికి ముందు మా నాన్నగారు తప్పుడు జాతకాలు రాయించారు చాలా - అదేదో నాపర్సనల్ ఫైల్లో వాళ్ళకు దొరికినట్లుంది - బాగా ఫూల్స్ అయ్యారు-హో హో హో !" అంటూ నవ్వాడు బసవరాజు.

" ఆ ! అంటే నన్ను కూడా మీ తప్పుడు జాతకాలతో ఫూల్‌ని చేశారా !" అంటూ మెట్టికాయలేసింది.

" కాని ఏం చెయ్యమంటావే నాకు కుజదోషం ఉందని సంబంధాలు రాకపోతే మా నాన్నకున్న పిచ్చి నమ్మకాలతో ఏదో పాట్లు పడ్డాడు. తన కొచ్చిన ఆడపిల్ల జాతకాలతో నప్పేట్లు తిప్పి రాయించేవాడు నా జాతకం" - బసవరాజు అసలు సంగతి చెప్పాడు.

" అరే మానాన్న తెలివితేటలు మామయ్య గారికీ వచ్చాయా ! నా నక్షత్రం బాగో లేదని, ఆ సంగతి తెల్సిన వాళ్ళు నన్ను పెళ్ళిచేసుకోరని జ్యోతిష్కులు చెబితే మా నాన్న కూడా మీ నాన్నలాగానే ఏవో చేశాడు - " దుర్గాంబ నోరు జారింది ఉత్సాహంతో.


" అందుకేనా నువ్వు కాలు పెట్టగానే మా వాళ్ళు హరీ అన్నారు !" నోరు నొక్కుకుంటూ అన్నాడు బసవరాజు.

" అయినా జాతకాల వలన, కాకాల వలన పన్లు జరుగుతాయా నాన్నా ?" పెద్దోడికి సందేహం వచ్చింది.

" జరిగినా జరక్కపోయినా మానవ ప్రయత్నం చెయ్యాలి గదా !" దుర్గాంబ చెప్పింది.

" అమ్మకు ఇంట్లో వంట తప్పినా ఆంటీ యింట్లో వంట తప్పలేదు" ముక్తాయింపుగా చిన్నోడు చెప్పాడు.

- స్వాతి వారపత్రిక


5
6
AVM
7


డాక్టరుగారూ! నాకు జ్వరం! త్వరగా రండీ! అడ్రసు చెబుతా! ఫీజు కూడా భారీగా ఇస్తా!!
1
మీ రోడ్డు చివర ఐదో నెంబరు కుండీ, పక్కసందులో నా పేరున్న బోర్డు!
2
5 మునిసిపాల్టి కుండి
యమ ధర్మరాజు
దొరికింది!
3
సరాసరి వచ్చేయండి నా దగ్గరకి వచ్చేస్తారు!
4
వచ్చేశా..అంటే! నవ్వుతావేం!?
AVM
5


స్వామీ!
ఒక్క నిమిషం!!
AVM


మీ అక్కా బావా! వచ్చి చచ్చారూ!
మీరు స్వీటు, కారం తెచ్చి ఛావండి!!
శ్రీవారూ!
AVM